# దివ్యాంగ విద్యార్థులకు అండగా భవిత కేంద్రాలు





**జిల్లా కలెక్టర్ హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ వద్ద గల భవిత కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. లలితతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేసిన కలెక్టర్, దివ్యాంగుల సాధికారతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దివ్యాంగ విద్యార్థుల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని, సరైన ప్రోత్సాహం అందిస్తే వారు చదువుతో పాటు క్రీడల్లోనూ అద్భుతాలు సృష్టించగలరని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన క్రీడల పోటీల్లో మన జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటడమే ఇందుకు నిదర్శనమని ఆమె కొనియాడారు. దివ్యాంగ విద్యార్థులకు నిరంతరం సేవలందిస్తున్న ఐ.ఈ.ఆర్.పి.ల కృషి అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల విద్యాశాఖ అధికారి సుభాష్, విలీన విద్యా కోఆర్డినేటర్ శాంతికుమార్, ఐ.ఈ.ఆర్.పి.లు, విద్యార్థులు, తల్లిదం డ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ళ గణనను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో జనాభా గణన-2027లో భాగంగా వచ్చే నెల 11 నుంచి ప్రారంభం కానున్న మొదటి విడత ఇళ్ళ గణనను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్ల శిక్షణా కార్యక్రమానికి సిపిఓ వాసుదేవ రెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరిగే ఈ గణనలో యజమానుల నుంచి 32 ప్రశ్నలకు సమాధానాలు సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1689 హౌస్ లిస్టింగ్ బ్లాకుల్లో 994 మంది ఎన్యుమరేటర్లు, 174 మంది సూపర్ వైజర్లు విధులు నిర్వహిస్తారని వివరించారు. శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని, ఎలాంటి పొరపాట్లు లేకుండా గణన ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రియాజ్ అలీ, ఎంపిడిఓ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- **మంత్రి పొంగులేటిని కోరిన ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాల గృహ అవసరాలను తీర్చేందుకు అదనపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ కోరారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ చారితో కలిసి శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గృహ వసతి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో ఇంకా వేలాది పేద కుటుంబాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అర్హులైన లబ్ధి దారులందరికీ న్యాయం జరగాలంటే అదనపు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు అత్యవసరమని పేర్కొన్నారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ దాస్, ప్యాక్స్ మాజీ డైరెక్టర్ చాట్ల ఉమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యువ నాయకులు అలపాటి అచ్యుతానంద రెడ్డి , ఎండి సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# హిందువుల మధ్య ఐక్యత అవసరం




**ఉద్యమ కెరటం, తాండూర్:** కుల, మత భేదాలు లేకుండా హిందువుల మధ్య ఐక్యత ఎంతైనా అవసరమని ఆదిలాబాద్ శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామి అన్నారు. శనివారం తాండూర్ మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భగవంతుని ఆశీస్సులతో మనమందరం ఒకే భూమిపై జీవిస్తున్నందున హిందువులందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ భావజాలాన్ని ప్రతిఒక్కరిలో పెంపొందించేందుకు ఇలాంటి సమ్మేళనాలు దోహదపడతాయని తెలిపారు. మద్యం, మాంసం వంటి చెడు అలవాట్ల కు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడిస్తేనే నిజమైన హిందువులమని చెప్పుకోవచ్చని అన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే హిందూ సంస్కృతి, ధర్మం గొప్పతనాన్ని బోధించాలని పిలుపునిచ్చారు. ప్రవచనాల ద్వారా అందించే సందేశాలను ఆచరణలో పెట్టి సమాజంలో వ్యాప్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి హనుమాన్ దేవాలయం నుంచి ఐబి మీదుగా సుమంగళి ఫంక్షన్ హాల్ వరకు భారీ హిందూ సమ్మేళన శోభయాత్ర నిర్వహించారు. కోలాట నృత్యాలు, భజనలతో భక్తి వాతావరణం నెలకొంది. అచ్చులపూర్ వేద పాఠశాల విద్యార్థులు వేద మంత్రోచ్ఛరణాలతో స్వామికి ఘన స్వాగతం పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూర్ ఎస్సై ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గోనె భూమయ్య, పొన్నవేని లక్ష్మి, రాంచందర్, రాజన్న, హిందూ సమ్మేళన కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

- **జోగిపేటలో పోలీసుల కార్డన్ సెర్చ్**
- **10 బైకులు, రూ.లక్ష విలువైన కలప స్వాధీనం**



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ/ఆదిలాబాద్:** ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండలంలోని జోగిపేట గ్రామంలో 'కమ్యూనిటీ కాంటాక్ట్' (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. సుమారు 70 మంది పోలీస్ సిబ్బందితో తెల్ల వారుజామున 5 గంటల నుంచే గ్రామంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో గ్రామంలోని ఇళ్లు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మొత్తం 38 ద్విచక్ర వాహనాలను పరిశీలించగా, సరైన ధ్రువపత్రాలు లేని 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15వేల చలాన్లను వాహనదారుల నుంచి వసూలు చేశారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.లక్ష విలువైన కలపను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న “అరైవ్..అలైవ్” రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాలు అవసరమని, వాటి ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్. రమేష్, ఎస్సై బండారి రాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.చంద్రశేఖర్, ఎస్సైలు ఇమ్రాన్, శ్రీకాంత్, పూజతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని బోయపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ సాంబమూర్తి (40) మృతి చెందాడు. మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డా డు. తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్ల ంపల్లి పట్టణం హనుమాన్ బస్తీకి చెందిన సాంబమూర్తి పని నిమిత్తం తాండూర్ వైపు వచ్చి తిరిగి ఇంటికి ఆటోలో వెళ్తున్నాడు. బోయపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాంబమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న అతని స్నేహితుడు భాస్కరి శ్రీనివాస్ స్వల్ప గాయాలతో బతికి బయటపడగా, 108 అంబులెన్స్ ద్వారా బెల్ల ంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సాంబమూర్తి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు కాలనీ వాసులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో ఏర్పాటు చేసిన 'జనతా చలివేంద్రాన్ని' శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు. అనంతరం కాలనీలో విశేష వైద్య సేవలు అందిస్తున్న ఆదిలాబాద్ రిమ్స్ సీఎంఓ అలీషా ఫాతిమా, మాజీ కౌన్సిలర్ డాక్టర్ లక్ష్మణ్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వారు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముబారక్, మౌలానా, సాదీఖ్, సయ్యద్ జుబేర్, హఫీజ్, నారాయణ్ అడ్వకేట్, మాజీ కోఆప్షన్ మెంబర్ అజీజ్, అల్మాస్, అజర్, అశోక్, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగామయి దయానంద్**




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగామయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో పాత సెంటర్, బస్ స్టాండ్ రింగ్ సెంటర్, అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం ప్రారంభించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పెనుబల్లి మండలం అడివి మల్లెల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మదర్ యూనిట్ కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మహిళలను ఆర్థి కంగా బలోపేతం చేస్తూ కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్ల గుళ్ల నరసింహ రావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాలు, పెనుబల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వర రావు, ఏపీఎం, డీపీఎం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సౌకర్యం కల్పించండి




**ఉద్యమ కెరటం, బెజ్జూ ర్:** బెజ్జూర్ గ్రామపంచాయతీ ఎలుకపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 35 కుటుంబాలు నివసిస్తున్నాయని, గత మూడు వారాలుగా చేతిపంపు పనిచేయకపోవడంతో మహిళలు కిలో మీటరు దూరంలోని పక్క కాలనీకి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థి తి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి తీవ్రత కారణంగా పిల్లలు, వృద్ధులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చేతి పంపులోని కొన్ని భాగాలు తొలగించడంతో సమస్య ఏర్పడిందని, అలాగే నీరు వెళ్లే మురికి కాలువను కొందరు అడ్డుకోవడంతో సమస్య మరింత తీవ్రమైందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నప్పటికీ ప్రతి ఇంటికి కనెక్షన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. చేతిపంపులు మరమ్మతులు చేయించాలని, మురికి కాలువను శుభ్రం చేయాలని కోరారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి మిషన్ భగీరథ నీరు అందేవరకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠం మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లా డి తక్షణమే బోరు మరమ్మతులు చేయిస్తామని, మిషన్ భగీరథ కనెక్షన్ల ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## కూలీల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం





**ఉద్యమ కెరటం, తాండూర్:** పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించి వారి ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని మాదారం, గోపాలనగర్, ఆచాలాపూర్ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలని సూచించారు. అలాగే పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఈచలాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, ఈసీ రమేష్, టీఏలు రాజేంద్రప్రసాద్, రాజేశ్వరి, సంబంధిత గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

## చలివేంద్రం సేవా దృక్పథానికి నిదర్శనం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రం సేవా దృక్పథానికి నిదర్శనమని ఆదిలాబాద్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి అన్నారు. గుడిహత్నూర్ బస్టాండ్‌లో రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిబ్బన్ కట్ చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సొసైటీని అభినందించారు. రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లా యీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య, మాజీ సర్పంచ్ రవి నాయక్, సొసైటీ సభ్యులు గణేష్, ఓం కుమార్, సునీల్, అతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో తుల అరుణ్ భేటీ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డి నేటర్ తుల అరుణ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం మర్యాదపూ ర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపినట్లు తెలిపారు. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలపర్చడానికి తీసుకోవాల్సిన సంస్థాగత చర్యలు, అలాగే బోథ్ రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన సమస్యలు, అత్యవసర పరిష్కార అవస రాలపై కూడా ప్రత్యేకంగా చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ భేటీతో బోథ్ ప్రాంత అభివృద్ధికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని భావిస్తున్నారు.

# మండిపోతున్న ఆదిలాబాద్

### నిప్పుల కొలిమిలా మారిన జిల్లా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువవుతుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. 9 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై, మధ్యాహ్నం అయ్యేసరికి జనం బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు.

### నిర్మానుష్యంగా రహదారులు..

తీవ్రమైన ఎండల కారణంగా జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ని ప్రధాన రహదారులు మధ్యాహ్న సమయానికి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపి స్తున్నాయి. వేడి గాలుల ప్రభావంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వచ్చేవారు గొడుగులు, రుమాళ్లు, టోపీలు ధరించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### పడగ విప్పుతున్న నీటి ఎద్దడి..

ఎండలు పెరగడంతో భూగర్భ జలమట్టం పడిపోయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి మొదలైంది. చేతి పంపులు ఎండిపో తుండటంతో మహిళలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నారు. మరోవైపు అటవీ ప్రాంతాల్లో నీటి కుంటలు ఎండిపో వడంతో వన్యప్రాణులు జనావాసాల్లో కి వచ్చే ప్రమాదం పొంచి ఉంది.

### చల్లని పానీయాలకు పెరిగిన గిరాకీ..

ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు జనం కొబ్బరి బోండాలు, చెరకు రసం, మజ్జిగ, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. పుచ్చకాయలు, తాటి ముంజల విక్రయాలు జోరందుకున్నాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు పట్టణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీరుస్తున్నారు.

### వైద్యుల సూచనలు..

మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలోకి రావొద్దు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లా లి.

### జిల్లా యంత్రాంగం అప్రమత్తం..

తీవ్రమవుతున్న ఎండల నేపథ్యంలో ఉపాధి హామీ కూలీల పని వేళల్లో మార్పులు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తగిన జాగ్రత్తలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికా రులను ఆదేశించారు.

# అదానీ కోసం దేశ ప్రయోజనాల తాకట్టు

- ధర్నా చౌక్లో యువజన కాంగ్రెస్ నిరసన



**ఉద్యమ కెరటం, నేరడిగొండ/ఆదిలాబాద్:** కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఇండో–యూఎస్ ట్రేడ్ డీల్ ద్వారా దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ సమీపంలోని ధర్నా చౌక్ వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'మహా ధర్నా' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన మిత్రుడు అదానీకి ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ ట్రేడ్ డీల్‌ను రూపొందిం చిందని విమర్శించారు. ఈ ఒప్పందం ద్వారా విదేశీ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్ దెబ్బతినే ప్రమాదం ఉందని, తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభించకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం సామాన్య ప్రజల హక్కులను బలిపెట్టడం దుర్మార్గమని అన్నారు. రైతు వ్యతిరేక నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఒప్పందాలను యువజన కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, యువ నాయకులు సద్దాం, గేడం నితీష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# భూ మోసం ముఠా గుట్టురట్టు

- నకిలీ పత్రాలతో ప్లాట్ విక్రయించిన నలుగురు అరెస్ట్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నకిలీ పత్రాలతో భూమిని విక్రయించి ప్రజలను మోసం చేస్తున్న ముఠాను మావల పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ జామా మసీదు ఇమామ్ జంశేడ్, ఎండి. తాఖియుద్దీ న్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బాధితులు 2024 జూలైలో ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలో రూ.4.95 లక్షలకు ఒక ప్లా ట్ కొనుగోలు చేశారు. నిందితులు తహశీల్దా ర్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లు నకిలీ పత్రాలు, గ్రామపంచాయతీ పన్ను రశీదులు, మున్సిపాలిటీ అంచనా రికార్డులను సృష్టించి విక్రయం జరిపారు. తర్వాత బాధితులు ఆ ప్లా ట్‌ను తిరిగి అమ్మే ప్రయత్నంలో అసలు యజమాని అభ్యంతరం వ్యక్తం చేయడంతో మోసం బయటపడింది. మావల తహశీల్దా ర్ విచారణలో పత్రాలు నకిలీవని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు షేక్ ముస్కానా, షేక్ ముజాహిద్, షేక్ అతీక్ అలియాస్ అత్తు, ఎస్కే ఫిరోజ్ లను అరెస్ట్ చేశారు. కాగా వసీం అహ్మద్, షేక్ ముజమ్మిల్ పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. భూమి కొనుగోలు చేసే ముందు సంబంధిత అధికారుల వద్ద పత్రాలను ధృవీకరించుకోవాలని సీఐ సూచించారు.

# రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు

- దళారులా.. మిల్లర్లా.. ఎవరి దగాకు రైతులు బలి కావాలి..?




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు, కొనుగోలు కేంద్రాల వద్ద మిల్ల ర్లదోపిడీకి గురి కావాలా అని తెలంగాణ రైతు సంఘం పెనుబల్లి మండల అధ్యక్షుడు చిట్టిమోదు కృష్ణయ్య ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తహశీల్దా ర్,ఐకెపి కార్యాలయాల ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ సంచుల కోసం గతంలో పోరాటాలు చేసిన ప్పటికీ సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో మిల్ల ర్లు క్వింటాకు 5 నుంచి 10 కేజీల వరకు కోత విధిస్తామని చెబుతూ తూకాలు ప్రారంభించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని కొనుగోలు ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టిం చుకోకపోతే ఉద్యమాలకు తాము కూడా మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర రాజేశ్వరరావు, తడికమళ్ళ చిరంజీవి, మల్లె ల్లిశ్రీను, వంగా రాము తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'అరైవ్.. అలైవ్' వైద్య శిబిరానికి జిల్లా రవాణా అధికారి సిహెచ్. రంజిత్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో సుమారు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఒక కుటుంబాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, అందుకే ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా లో బ్లైండ్ స్పాట్లు గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని, రాంగ్ రూట్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే లైసెన్స్ సస్పెండ్ చేయబడుతుందని, 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

